క్లుప్తంగా

విద్య, విజ్ఞానం ముఖ్యం



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం కూడా ముఖ్యమని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయన్నారు. సుమారు 200 ప్రాజెక్టులకు ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో కొండవీటి సత్యనారాయణ, కేవీ స్వామి, అద్దాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీ హోమం

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు కాళ్లకూరి అచ్యుత రామారావు బ్రహ్మత్వంలో చండీహోమం జరిపారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున చండీహోమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా కార్తీక వన సమారాధన



వడలిలో దామోదర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలి కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఉత్సాహంగా నిర్వహించారు. శుక్రవారం పంచాయతీ వద్ద ఉసిరి చెట్టుకు కార్తీక దామోదర పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నేలపైనే కూర్చున సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం చిన్నారులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐదు మంచాలు అందించాలని మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్ కుమార్ కోరారు. పీహెచ్‌సీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెడికల్ సిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరు అవుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. డెలివరీ రూమ్, ఆపరేషన్ థియేటర్, వార్డు, ల్యాబ్ రూమ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డా.ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మాసిస్టు పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫిజీషియన్ పోస్టు భర్తీ

పెనుగొండ: పెనుగొండ సీహెచ్‌సీలో ఎండీ(ఫిజీషియన్) పోస్టు భర్తీ చేయడం చేస్తామని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో సీహెచ్‌సీలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలనే కథనానికి ఆయన స్పందించారు. పోస్టు భర్తీపై ఉన్నతాధికారులకు విన్నవించామని వివరించారు. రానున్న రోజుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

దాళ్వాకు ఎంటీయూ 1426 అనుకూలం

ఆకివీడు: నూతన వంగడాలను సాగు చేస్తూ రైతులు స్థానిక ప్రజలు తినే బియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఖరీఫ్ సాగులో ఎంటీయూ 1310 రకం వగడం దిగుబడిని పరిశీలించేందుకు శుక్రవారం ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులు, తక్కువ రోజుల్లో దిగుబడులు అధికంగా వచ్చే వంగడాలపై రైతుల దృష్టి ఉందన్నారు. ఎంటీయూ 1310 రకం, చౌడును తట్టుకునే ఎంటీయూ 1293 వంగడం, ముంపును తట్టుకునే ఎంటీయూ 1232 రకం వంగడాల సాగు ఆశాజనకంగా ఉందని చెప్పారు. వచ్చే దాళ్వా సాగులో రైతులు నూతన వరి వంగడాలు సాగు చేసేందుకు ఎంటీయూ 1426 రకం వంగడాన్ని ఏడు జిల్లాల్లో 160 మినీ కిట్లు పంపిణీ చేసినట్లు వివరించారు.1121 రకంతో ఎన్ఎల్ఆర్ 34449 వరంగడాన్ని సమ్మేళనం చేసి ఎంటీయూ 1426 వంగడాన్ని సృష్టించినట్లు చెప్పారు. మధ్యస్థ సన్నాలుగా ఉండి బీపీటీ రకాన్ని పోలి ఆర్ఎన్ఆర్‌కు దీటుగా ఉంటుందని చెప్పారు.

పెట్టుబడులు భారం-దిగుబడులు ఘోరం

- దిగుబడి లేక అన్నదాత దిగాలు
- వాతావరణం దెబ్బకు మరింత కుదేలు



పెనుమంట్రలో ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులు చేస్తున్న కౌలు రైతులు



ఆలమూరులో హడావుడిగా రైసుమిల్లుకు ధాన్యం తరలిస్తున్న రైతులు

పెనుమంట్ర: ఈ ఏడాది వ్యవసాయం అస్సలు కలిసి రాలేదని రైతులు వాపోతున్నారు. సాగు ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో పెట్టుబడులు అధికమయ్యాయని చెబుతున్నారు. అయితే దిగుబడులు మాత్రం ఆశాజనంగా లేవని వాపోతున్నారు. పెట్టుబడులు అధికమైనప్పటికీ దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుమంట్ర మండలంలో సార్వా సాగును 12 వేల ఎకరాల్లో 6800 మంది రైతులు సాగు చేశారు. ఎక్కువ శాతం మంది స్వర్ణ, 1318 రకాల వరినాట్లు వేయడం నారుమడుల నుంచి పంట చేతికి వచ్చే సమయం వరకు అధిక వర్షాల వల్ల అనేక పల్లపు ప్రాంతాలు వరిచేలు ముంపుబారిన పడడమే కాకుండా, కొన్ని ప్రాంతాలలో నాట్లు కుళ్లిపోవడంతో ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించడంతో పాటు రెండేసి సార్లు నాట్లు వేసే పరిస్థితి ఎదురైంది.

అధిక ఖర్చులతో సతమతం

రైతులకు ఇటీవల విత్తనాలు, కూలీల ఖర్చులు అధికమయ్యాయి. ఎకరాకు స్వర్ణ 30–35 బస్తాలు దిగుబడి వస్తుండగా, ఎంటీయూ 1318 రకం 30 బస్తాలకు మించి దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రెండురోజులుగా ప్రభుత్వం తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడం వరిచేలు కోత దశకు చేరుకోవడంతో మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో వాతావరణ పరిస్థితులు రైతులను మరింత గందరగోళానికి గురి చేస్తున్నాయి. తుఫాన్ దెబ్బకు తమ ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకునే పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. రైతులే తమ ధ్యాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు అమ్ముకునే అవకాశం కల్పించినప్పటికీ రైతు సేవా కేంద్రాల్లో దళారుల ఇష్టారాజ్యంగా నడుస్తుందని దళారులు చెపితేనే రైతుల చేతికి సంచులు వస్తున్నాయని చెబుతున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి శుక్రవారం ఓ ప్రకటనలోతెలిపారు. ఎంపీపీ అందే సూర్యావతి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా మాజరుకావాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్గో సేవలు, విద్యార్థులకు అందిస్తున్న రాయితీలు, ప్రత్యేక బస్సులు, కొత్త బస్సు సర్వీసుల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు, ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు. ప్రయాణికులు 99592 25486 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

హోటళ్లు, కర్రీ పాయింట్లపై అజమాయిషీ ఉందా?

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మాట్లాడుతున్న కౌన్సిలర్లు

నరసాపురం: పట్టణంలో భోజనం హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కోకొల్లలుగా వెలస్తున్నాయని, అసలు ఆ హోటళ్లలో ఆహారం నాణ్యత ఎలా ఉంటుంది? ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు ఇతర పదార్థాలు కలుపుతున్నారా? అనే అంశాలపై మున్సిపాలిటీ శానిటరీ అధికారులకు అజమాయిషీ ఉందా అని కో–ఆప్షన్ సభ్యుడు ఏడిద కోటసత్యనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైకేఎస్ హోటళ్లు, కర్రీ పాయింట్లలో ఆహార పదార్థాల తయారీ అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో హోటళ్లలో ఆహార పదార్థాల తయారీపై అనే ఆరోపణలు వస్తునానయని అన్నారు. నరసాపురంలో కూడా అదే పరిస్థితి ఉందన్నారు. అసలు మున్సిపల్ అధికారులు హోటళ్లు, కర్రీ పాయింట్లు తనిఖీ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. దీనికి శానిటరీ ఇన్స్‌పెక్టర్ త్రినిద్ బదులిస్తూ, ఆ బాధ్యతలు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చూస్తున్నారని చెప్పారు. అయితే గతంలో మాదిరిగా హోటళ్లపై మున్సిపాలిటీ అజమాయిషీ కూడా ఉండాలని వైకేఎస్ సూచించారు. కొన్ని కర్రీ పాయింట్ల వద్ద వంటలు రోడ్డుమీదే చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

సభ్యులంటే గౌరవం ఏదీ?

కౌన్సిలర్లు అంటే అధికారులకు ఏ మాత్రం గౌరవం లేదని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో తాను మాధవాయిపాలెం ఫెర్రీ ఆదాయం మున్సిపాలిటీకి కూడా చెందే విధంగా చర్యలు చేపట్టాలని అడిగానని, గత సమావేశంలో కొందరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానలు పంపారని చెప్పారు. కానీ తాను ప్రస్తావించిన అంశంపై తనకు సమాధానం ఇవ్వలేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. కమిషనర్ తీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి రామసీత కూడా కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చెరుకూరి లక్ష్మణరావు విగ్రహం పెట్టాలని కోరినా సమాధానం ఇవ్వలేదన్నారు. 5వ వార్డు సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణ సెక్షన్‌లో అసలు ఎంతమంది పని చేస్తున్నారో? తెలియని పరిస్థితి నెలకొని ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సచివాలయ ఉద్యోగుల విషయంలో కమిషనర్ ఇష్టారాజ్యమా?

స్థానిక కౌన్సిలర్లుకు సమాచారం ఇవ్వకుండా వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులను కమిషనర్ ఇష్టానుసారం మారుస్తున్నారని కేసరి గంగరాజు, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని వాగ్వివాదానికి దిగారు. ఇది సరైన పద్ధతి కాదని స్వతంత్ర సభ్యుడు కోటిపల్లి సురేష్ వివరించారు. ఇలా అయితే సమస్యలు ఎలా పరిష్కరిస్తారు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని ఈ విషయంలో అధికారుల తీరును తప్పుబట్టారు. అలాగే గోదావరి ఒడ్డున మలాన్ని శుభ్రం చేసే యూనిట్ మూతపడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్లు బొంతు రాజశేఖర్, అడిదల శ్యామల, మల్లాడి శేషవేణి, సిర్రా కాంతమ్మ, పతివాడ పద్మ, సోమరాజు దుర్గాభవానీ, పాలూరి బాబ్జి, ద్వారా గంగాభవానీ, జిల్లెళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ (స్కాలర్‌షిప్) పరీక్షలకు హాజరుకాబోతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం అని రావాల్సిన హాల్ టికెట్లు తెలుగు మీడియం అని రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్షలకు సుమారు 54 మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియలో కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. అయితే డిసెంబర్ 8న నిర్వహించే పరీక్షలకు హాజరయే విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో రావాల్సిన హాల్ టిక్కెట్లు ఒక్క విద్యార్థిక మినహా మిగిలిన 53 మంది విద్యార్థులకు తెలుగు మీడియం అని హాల్ టిక్కెట్లు వచ్చాయని మండిపడ్డారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు రామరాజును వివరణ కోరగా తమ స్కూలు సిబ్బంది పొరపాటున ఇంగ్లీష్ మీడియం ఆప్షన్ సెలెక్ట్ చేయబోయి పొరపాటున తెలుగు మీడియం సెలెక్ట్ చేయడంతో సమస్య వచ్చిందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు సమాచారమందించానని తెలిపారు. ఈ ఆందోళనలో దొంగ ప్రసాద్, కవురు ముత్యాలరావు, కడలి యోగానంద కాండ్రేకుల సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ కొల్లాటి చూడామణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యపురి రోడ్డు మరమ్మతులు చేయాలని ధర్నా



ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం–భీమవరం వయా మత్స్యపురి ఆరర్‌అండ్‌బీ రోడ్డును మరమ్మతులు చేసి, అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్అండ్‌బీ ఏఈఈ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ మత్స్యపురి రోడ్డు అధ్వానంగా తయారవ్వడంతో ప్రయాణికులు నరకయాతన చూస్తున్నారని అన్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాపోయారు. నిధులు కేటాయించి వెంటనే రోడ్డు బాగు చేయాలని కోరారు. అలాగే నరసాపురంమండం కొత్తనవరసపురం, పాత నవరసపురం గ్రామాల్లో కూడా రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, జెల్లి రామ్మోహన్‌రావు, తెలగంశెట్టి సత్యనారాయణ, పొగాకు పూర్ణాంభ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంపై శిక్షణ



యలమంచిలి: శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మండల అధికారులు



పెనుగొండ: శిక్షణలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి

యలమంచిలి: యుక్త వయస్సుకు వచ్చిన యువతులు (కిశోర బాలికలు) తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, నెలసరి శుభ్రత, పౌష్టికాహార ప్రాధాన్యతలు గురించి మండల స్థాయి అధికారులంతా తమకు వీలైన సమయంలో పాఠశాలలకు వెళ్లి వివరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, మహిళ ఉపాధ్యాయులు, మండల సమాఖ్య అధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి వర్కర్లకు కిషోర బాలికలకు తెలియజేయాల్సిన అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, చదువు ఆవశ్యకతల గురించి వివరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటిండెంట్ గుబ్బల శ్రీనివాసరావు, ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, డాక్టర్ సతీష్, ఏసీడీఓ నాగరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, ఏపీఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ: బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. శుక్రవారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కిశోర వికాసం ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాకర్, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో...

బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని పెనుమంట్ర సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పూర్ణ బాబ్జి అధ్యక్షతన కిశోర వికాసం వన్ ట్రైనింగ్ వన్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలపై పోలీసులకు సమాచారం అందించడానికి 100,112 నంబర్లను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నరసాపురం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలికలు, మహిళలను లైంగికంగా వేధించినా శిక్షార్హులవుతారని సీడీపీఓ బి.ఊర్మిళ అన్నారు. శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా నరసాపురం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ పుష్పరాజ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పద్మావతి, విజయకుమారి, శ్రీదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కవిటంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ పార్వతి

పెనుగొండ: వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ పాలకొల్లు సహాయ సంచాలకులు అద్దాల పార్వతి అన్నారు. శుక్రవారం పోడూరు మండలంలోని జిన్నూరు, మట్టపర్రు, కవిటం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రైతులు త్వరగా ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించుకోవాలన్నారు. ధాన్యం తగిన జాగ్రత్తలతో భద్రపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, జిన్నూరు అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎస్.సూర్యకిరణ్, కవిటం అసిస్టెంట్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

ఇంటర్నల్ స్క్వాడ్‌లో భాగంగా నరసాపురం సబ్ డివిజన్ ఏడీఏ ఇ.అనిలకుమారి పోడూరు మండలంలో ఎరువులు, పురుగు మందుల షాపులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఓ జి.సత్యనారాయణ ఉన్నారు.

శివాలయాల్లో మాస శివరాత్రి సందడి



లక్ష రుద్రాక్షల అలంకరణలో సోమేశ్వరుడు



సోమేశ్వరుని ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కేశవస్వామి ఆలయంలో ఆకట్టుకున్న దీపాలంకరణ



నామం ఆకారంలో వెలిగించిన దీపాలు

యలమంచిలి: యలమంచిలి కేశవస్వామి ఆలయంలో నిత్య కార్తీక మాస దీపోత్సవం ఘనంగా జరుగుతుంది. శివ, కేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో ఆలయంలో కేశవస్వామి మండపం ఎదురుగా కృతిమ శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ప్రతి రోజు ఆలయ ఆవరణలో శంకు, చక్ర, నామాలను వేసి వాటి చుట్టూ దీపాలను వెలిగిస్తున్నారు. శివ, కేశవుల దర్శనం, దీపోత్సవం ఒకే ప్రాంగణంలో జరుగుతుండటతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకుని దీపోత్సవంలో భాగస్వాములవుతున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో గ్రామ ప్రజల సహకారంతో జరుగుతున్న ఈ దీపోత్సవాన్ని కార్య నిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. కార్తీక దీపోత్సవంలో భాగంగా చివరి రోజు ఆదివారం 12 రకాల పువ్వులు, 12 రకాల ఫలాలు, 12 రకాల వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు గోపి తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా సంప్రదించాలని ఆయన కోరారు.

సోమేశ్వరస్వామికి లక్షరుద్రాక్ష పూజలు

పెనుమంట్ర: కార్తీకమాసం, మాసశివరాత్రి సందర్భంగా జుత్తిగ గ్రామంలో నిఉన్న శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామివారికి శుక్రవారం లక్షరుద్రాక్ష, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. 20 మందికి పైగా వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య ఉదయం గణపతిపూజ, అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ఎయిడ్స్ మహమ్మారి ఆఫ్రికా దేశంలో 1983లో విజృంభించడంతో సుమారు నాలుగు కోట్ల మంది మృత్యువాత పడ్డారని డాక్టర్ మల్లికార్జున శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున శర్మ మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ ద్వారా శరీరంలోకి ప్రవేశించి రక్తంలో ఉన్న తెల్ల రక్త కణాల్లో ఇమ్యూనిటీ శక్తిని తగ్గించి నాలుగు దశల్లో మనిషి మరణానికి కారణం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, కె.భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

రేపు లయన్స్‌లో ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లయన్స్ ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు నందు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు కిడ్నీ, షుగర్, ప్రసూతి, మానసిక, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులు, దంత వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. విజయ ల్యాబ్ ఆధ్వర్యంలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ టెస్ట్‌లు ఉచితంగా చేస్తారన్నారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకుని వైద పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ యిమ్మిడి లలిత, ట్రెజరర్ మాటూరి రత్నదీప తదితరులు పాల్గొన్నారు.